ఈ నెల 30 వరకు డిగ్రీ పరీక్ష ఫీజు గడువు

బెల్లంపల్లి, మార్చి 27 : కేయూ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2, 4, 6 సెమిస్టర్ల పరీక్ష ఫీజులను ఈ నెల 30 లోపు చెల్లించాలని కళాశాల ప్రిన్సిపాల్ టీఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫీజులను ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30వరకు, రూ.50 అపరాధ రుసుంతో ఏప్రిల్ 10 వరకు ఫీజు చెల్లించవచ్చని వెల్లడించారు. ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను కళాశాలలో అందజేయాలని సూచించారు.

నిందితుడి అరెస్ట్

మంచిర్యాల ఏసీసీ, మార్చి 27:న్యాయస్థానానికి హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల సీఐ బన్సీలాల్ బుధవారం తెలిపారు. మంచిర్యాల ఏసీసీ ప్రాంతానికి చెందిన ముప్పాళ్ల సమ్మయ్యపై 2017లో యాక్సిడెంట్ కేసు నమోదుకాగా న్యాయస్థానానికి హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడని తెలిపారు. దీంతో వారెంట్ జారీ చేసి కోర్టులో హాజరు పర్చి, లక్షెట్టిపేట జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితుడు కోర్టుకు హాజరు కాకుండా దొంగతనాలకు పాల్పడుతూ ఇతర ప్రదేశాల్లో అరెస్ట్ అయ్యి జైలుకు వెళ్లి వచ్చినట్లు వెల్లడించారు.

ప్లాస్టిక్ కవర్లు వాడవద్దు

లక్షెట్టిపేట, మార్చి 27: పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకం నిలిపివేయాలని లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్ వ్యాపారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ కవర్లను వాడితే మున్సిపల్ చట్టం- 2019 ప్రకారం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. నిభంధనలకు లోబడి ఉన్న కవర్లను మాత్రమే వాడాలని సూచించారు. ఇక్కడ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అజీమ్, ఎన్విరాన్‌మెంట ఇంజినీర్ కట్ల రాకేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

కాసిపేట, మార్చి 27 : మండల ఆదివాసీ సేన కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ కోఆపరేటీవ్ ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతిని దండేపల్లిలో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన అధ్యక్షుడు మాడావి వెంకటేశ్, గౌరవాధ్యక్షుడు గంగారాం, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్, ప్రధాన కార్యదర్శి గణపతి, కోశాధికారి ఆత్రం సంజీవ్, పెంద్రం తిరుపతి, శ్రీనివాస్, సుధాకర్ పాల్గొన్నారు.

అసైండ్ భూముల కబ్జా .. - అడ్డుకున్న అధికారులు

కాసిపేట, మార్చి 27 : బెల్లంపల్లి మండలం ఆకెనపల్లి శివారులోని సర్వే నంబర్ 3 లో అసైండ్ భూములను కబ్జా చేసి పనులు చేస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. అసైండ్ భూములు మావంటే మావని పలువురు గొడవలు పడి ఇటీవల ఫిర్యాదులు చేసుకోవడంతో అధికారులు విచారణకు వచ్చారు. ఈ భూములకు రూ.కోట్ల ధర పలుకుతుండడంతో అనుమతులు లేకుండానే భూములను చదును చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. జేసీబీ, ట్రాక్టర్లతో పనులు చేస్తుండగా రెవెన్యూ అధికారులు పనులను అడ్డుకొని నిలిపివేశారు. ఏమైనా ఆధారాలు ఉంటే చూపాలని, పత్రాలను తీసుకొని ఆర్డీవో కార్యాలయానికి రావాలని, అప్పటి వరకు పనులు చేయవద్దని ఆదేశించారు. ఇది పూర్తిగా అసైండ్ భూమని, స్వాధీనం చేసుకొని భూమి లేని నిరుపేదలకు పంచాలని సోమగూడెం మాజీ సర్పంచ్ ప్రమీలాగౌడ్ కోరారు. ఇక్కడ రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష గడువు పొడిగింపు

బెల్లంపల్లిరూరల్, మార్చి 27: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ 2024-25 విద్యాసంవత్సరానికి 6,7,8,9 తరగతులకు సంబంధించి గురుకులాలు, సీవోఈ కళాశాలల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష గడువు మార్చి 30 వరకు పొడిగించినట్లు బెల్లంపల్లి సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సందన రాజ స్వరూప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి

బెల్లంపల్లిరూరల్, మార్చి 27: సాంఘిక, ట్రైబల్ సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 6,7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సంక్షేమ గురుకులాల రీజనల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి తెలిపారు. కరీంనగర్ జిల్లాలోని అలుగునూరు, రంగారెడ్డి జిల్లాలోని గౌలిదొడ్డి గురుకుల పాఠశాలల్లో 9 వ తరగతి రెగ్యులర్ అడ్మిషన్స్ జరుగుతున్నట్లు వెల్లడించారు. వికారాబాద్ జిల్లాలోని పరిగి (బాలికలు), ఖమ్మం (బాలికల) పాఠశాలల్లో 8 వ తరగతి లో రెగ్యులర్ ప్రవేశాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ నెల 30 వరకు www.tswreis. ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల అవివేకానికి నిదర్శనం

జీవో కాపీలను చూపిస్తున్న మంచిర్యాల పట్టణ బీఆర్ఎస్ నాయకులు

- మంచిర్యాల పట్టణానికి రూ.202 కోట్ల అభివృద్ధి పనులు చేసింది మాజీ ఎమ్మెల్యేనే
- నడిపెల్లి దివాకర్‌రావును విమర్శించడం తగదు
- బీఆర్ఎస్ పట్టణ నాయకులు

మంచిర్యాల ఏసీసీ, మార్చి 27: కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావుపై ఇష్టారీతిన మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శనమని బీఆర్ఎస్ మంచిర్యాల పట్టణ నాయకులు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంచిర్యాల పట్టణాధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్ మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు హయాంలో వేల కోట్ల రూపాయలతో మంచిర్యాల అభివృద్ధి జరిగిందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్, గూడెం రమాసత్యనారాయణ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 30 వేల ఎకరాలకు నీళ్లు అందుతున్నాయంటే అది దివాకర్‌రావు పుణ్యమేనని గుర్తుచేశారు. మంచిర్యాలలో జిల్లా ప్రజల కోసం మెడికల్ కాలేజ్ కల నెరవేర్చిన ఘనత, టూ టౌన్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి అండర్ బ్రిడ్జి నిర్మాణం, అంతర్గాం బ్రిడ్జి టెండర్, రూ.15 కోట్లతో బైపాస్ రోడ్డును అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కూడళ్ల సుందరీకరణ కావడంతో ప్రజలు సెల్ఫీలు దిగుతున్నారని తెలిపారు. సింగరేణిలో పట్టాలు, రాజీవ్‌నగర్‌లో 8వేల మందికి ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనుడు ఎవరో తెలుపాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఐబీ చౌరస్తా నుంచి శ్రీనివాస గార్డెన్ వరకు రూ.35 కోట్లతో రోడ్డు వెడల్పు పనులు, పాతమంచిర్యాల నుంచి సున్నంబట్టి వాడ, ఆండాళమ్మకాలనీ, తిలక్‌నగర్, గోపాల్‌వాడ, ఓవర్‌బ్రిడ్జి రోడ్డు వెడల్పు పనులకు రూ.15కోట్లు, రూ.4 కోట్లతో డాంబర్ రోడ్లు, రూ.15 కోట్లతో టీయూఎఫ్ఐడీసీ టూటౌన్ కు 60 ఫీట్ల రోడ్డు పనులు డెవలప్‌మెంట్ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు రూ.202 కోట్ల అభివృద్ధి పనులు చేశారంటున్నారని, ఎక్కడ పనులు చేశారో చూపించాలని సవాల్ విసిరారు. డీఎంఎఫ్‌టీ నిధులకు సంబంధించి 430 వర్కులు దివాకర్ రావు సాంక్షన్ చేయిస్తే ఆ వర్కులనే క్యాన్సల్ చేయించి జీవోలను మార్చి మళ్లీ టెండర్‌లకు పిలుస్తున్నారని ఆరోపించారు. రంగంపేట బ్రిడ్జిని మసిపూసి మారేడుకాయ చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో సాంక్షన్ అయిన జీవో 723 నిధులు 12 కోట్లు, 143 జీవో ప్రకారం స్టార్టర్ హౌస్ కోసం తీసుకొచ్చిన నిధులు రూ.1.50 లక్షలు కలిపి మొత్తం రూ.13.50 కోట్లతో బ్రిడ్జిని నిర్మిస్తున్నామని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎంసీహెచ్‌కు సంబంధించి దివాకర్‌రావుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. రూ.500 కోట్లతో మార్కెట్ యార్డు ఏరియాలో 350 పడకల దవాఖాన నిర్మాణ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఐబీలో ఎంసీహెచ్ కడితే తల్లి ఒకచోట బిడ్డ మరోచోట ఉంటుందన్నారు. ఐబీలో మార్కెట్‌ను కూల్చితే బీఆర్ఎస్ అడ్డుకుంటుందని హెచ్చరించారు. అమృత స్కీం కోసం నస్పూర్‌కు రూ.70 కోట్లు , లక్షెట్టిపేటకు రూ.20 కోట్లు, మంచిర్యాలకు రూ.48.05 కోట్లు మొత్తం రూ.140 కోట్లు తీసుకొచ్చింది దివాకర్‌రావు అని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్ 64 గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారా, అనుకూలిస్తున్నారా తేల్చిచెప్పాలన్నారు. గతంలో కరకట్ట నిర్మాణానికి రూ.270 కోట్లు మంజూరు చేయించిన అని ప్రెస్‌మీట్లు పెట్టి చెప్పి, అసెంబ్లీ సమావేశాల్లో కరకట్ట నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే అడిగారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ జీవోలకు సంబంధించిన నిధులన్నీ దివాకర్‌రావు తెచ్చినవేనని, కాంగ్రెస్ వాళ్లు తెచ్చింది ఏదైనా ఉంటే బయట పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సందెల వెంకటేశ్, గోగుల రవీందర్ రెడ్డి, ఎర్రం తిరుపతి, తోట తిరుపతి, చంద్రశేఖర్ హండే పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తాండూర్, మార్చి 27: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో 0-18 సంవత్సరాల వయసు గల ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అందించే సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ సూచించారు. భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఫిజియోథెరఫీ వైద్య పరీక్షల శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. భవిత సెంటర్‌లో ప్రతి బుధవారం ఫిజియోథెరఫీ క్యాంపు నిర్వహిస్తారన్నారు. ఈ క్యాంప్‌లో నాడీ వ్యవస్థ, ఆర్థోపెడిక్ సమస్యలు గల పిల్లలకు ఫిజియోథెరపిస్ట్ వెంకటేశ్ చికిత్స అందిస్తారని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రానికి తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్ కిష్టంపేట్ ప్రధానోపాధ్యాయుడు మాసాడి శ్రీరాములు, ఐఈఆర్పీలు వెంకటేశ్వర్లు, సతీశ్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

తాండూర్ భవిత కేంద్రంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈవో ప్రభాకర్

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

బెల్లంపల్లి, మార్చి 27 : కన్నాల 363 జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్డీవో హరికృష్ణ సూచించారు. ఇటీవల జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయంలో జాతీయ రహదారులు, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. యూ టర్న్ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారిపై రాష్ డ్రైవింగ్, ఇతర ప్రమాదాలు జరిగే వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. జాతీయ రహదారిపై ఉన్న వైన్‌షాప్‌కు ఉన్న అనుమతులపై విచారణ జరిపించాలని మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డిని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కన్నాల జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ఏడుగురి మృతికి కారణమైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు మాస మురళి, చిలుక రాజనర్సు ఆర్డీవోను కోరారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన వైన్‌షాప్‌ను తొలగించాలని మాజీ సర్పంచ్ మంద అనిత కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, బెల్లంపల్లి రూరల్ సీఐ అప్జలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలి

జైపూర్: ఇందారం ఓపెన్‌కాస్ట్ పని ప్రదేశాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్, మార్చి 27: సింగరేణిలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి, అధికారి రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని ప్రాజెక్టులు, ప్లానింగ్ డైరెక్టర్ జీ వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. బుధవారం శ్రీరాంపూర్ ఆర్కే -7 గనిని జీఎం సంజీవరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. అనంతరం శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించి క్వారీలో పని స్థలాలు పరిశీలించారు. ఆర్కే -7 గనిలోకి డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి, జీఎం మ్యాన్ రైడింగ్ ద్వారా దిగారు. గనిలోని 2వ సీంలో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి పని ప్రదేశాల్లోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించి ఓసీపీ ఓబీ కాంట్రాక్టు సంస్థలు సీఆర్ఆర్, జీవీఆర్ ప్రతినిధులతో మాట్లాడారు. వారికి కేటాయించిన రోజువారీ మట్టి తవ్వకాలు(ఓబీ) తరలింపు లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏరియా ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, పీవో శ్రీనివాస్, ఆర్కే -7 ఏజెంట్ ఏవీ రెడ్డి, మేనేజర్ శ్రీధర్, ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీ, ఈఈ చంద్రశేఖర్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సర్వే ఆఫీసర్ సంపత్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు ఉత్పత్తి సాధించాలి

జైపూర్, మార్చి 27: లక్ష్యం మేరకు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సింగరేణి ప్లానింగ్, ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డితో కలిసి ఇందారం ఓపెన్‌కాస్టు గనిని సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపరితల గనిలో నాలుగు రోజుల్లో ఓబీ ఉత్పత్తి లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. ఓబీ ఎంత ఎక్కువ తీస్తే బొగ్గు అంత ఎక్కువ రవాణా చేయడానికి అవకాశం ఉంటుందని సంబంధిత ఓబీ కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, గ్రూప్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఉపరితల గని మేనేజర్ రవికుమార్, ప్రాజెక్టు ఇంజినీర్ రమేశ్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

ఆర్‌వోబీ వంతెన నిర్మాణం పూర్తి

- వాహనాల రాకపోకలు ప్రారంభం
- తీరిన ఇరుకు వంతెన కష్టాలు

మందమర్రిలో ఆర్‌వోబీ వంతెనపై వాహనాల రాకపోకలు

మందమర్రి, మార్చి 27: మందమర్రిలో కోల్‌బెల్ట్ రహదారి పై చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రజలు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మందమర్రి మున్సిపాలిటీ జాతీయ రైల్వే లైనుకు ఇరుపక్కలా ఉండడంతో నిత్యం వేలాది మంది ఈ రహదారి గుండా ప్రయాణాలు సాగిస్తుంటారు. పట్టణ ప్రజలు ఎటు వెళ్లాలన్నా రైల్వే లైన్ దాటాల్సిందే. పాతబస్టాండ్ మీదుగానే మంచిర్యాల ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో పాటు సింగరేణి మందమర్రి ఏరియాలోని పలు గనుల్లో ఉత్పత్తవుతున్న బొగ్గును కూడా లారీల్లో రామకృష్ణాపూర్ సీహెచ్‌పీతో పాటు జైపూర్ విద్యుత్ కేంద్రానికి ఈ వంతెన ద్వారా రవాణా చేస్తుంటారు. ఈ రహదారిలో జాతీయ రైల్వే లైనుపై ఇరుకు వంతెన ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించారు. ఇరుకు వంతెన వద్ద పలుమార్లు ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇరుకు వంతెన మూలంగా ఎదురవుతున్న ఇబ్బందులను అప్పటి చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ దృష్టికి తీసువెళ్లగా వంతెన నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులతో చర్చించి నూతన వంతెన నిర్మాణానికి రూ.27.05 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఆర్ అండ్ బీ నిధులతో చేపట్టిన వంతెన నిర్మాణం పనులను పలుమార్లు పర్యవేక్షించి శరవేగంగా పూర్తి అయ్యేందుకు కృషి చేశారు.

బాధితులకు అండగా నిలిచి..

ఆర్‌వోబీ వంతెన నిర్మాణంతో రామన్ కాలనీ ఏరియాలో కోల్‌బెల్ట్ రహదారికి ఇరువైపులా నిర్మించుకుని దశాబ్దాలుగా జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల నివాసాలు, వ్యాపార సముదాయాలను కోల్పోయే పరిస్థితి నెలకొంది. దీంతో ఆందోళన చెందిన బాధితులు సమస్యను ప్రభుత్వ మాజీ విప్ బాల్క సుమన్‌కు వివరించడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి వంతెన నిర్మాణంతో ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకున్నారు. వంతెన నిర్మాణం అలైన్‌మెంట్‌ను మార్చి మలుపు తిప్పడంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నారు. వంతెన నిర్మాణ పనులు పూర్తయి అధికారికంగా ప్రారంభించక పోయినప్పటికీ వాహనాల రాకపోకలు ప్రారంభమై దశాబ్దాల కల నెరవేరడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాద రహిత సింగరేణి లక్ష్యంగా పని చేయాలి

కాసిపేట 2 గనిని పరిశీలిస్తున్న అధికారులు

కాసిపేట, మార్చి 27 : ప్రమాద రహిత సింగరేణి లక్ష్యంగా ఉద్యోగులు పని చేయాలని సింగరేణి ఏరియా రక్షణాధికారి రవీందర్ సూచించారు. బుధవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట -2 ఇంక్లైన్ గనిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా ఏరియా రక్షణాధికారి హాజరై మాట్లాడారు. రక్షణ సూత్రాలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. కార్మికుల ఆరోగ్యమే కంపెనీకి శ్రీరామరక్షని తెలిపారు. ఇక్కడ కేకే గ్రూప్ ఏజెంట్ రామదాసు, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, తదధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

దుప్పట్లను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

లక్షెట్టిపేట, మార్చి 27: పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ఎస్, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ ఏరియాలో నిరుపేద కుటుంబాలకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలన్నారు. విద్యార్థుల్లో సోషల్ యాక్టివిటీస్ పెంపొందించడం కోసం ప్రత్యేకంగా కళాశాల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను రూపొందించట్లు తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు సవిత, కుమారస్వామి, అధ్యాపకులు గంగయ్య, రాజ్‌కుమార్, శ్రీలత, మంజుల, చంద్రశేఖర్, శ్రీనివాస్, సంధ్య, కవిత, నాగేంద్రప్రసాద్, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత

హాజీపూర్, మార్చి 27 : దొనబండ ఊర చెరువులో ఉపాధి హామీ పనిలో భాగంగా చెరువులో పూడిక తీస్తున్న కూలీలకు ఎంపీడీవో మధుసూదన్, ఏపీవో మల్లయ్య బుధవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎండలు ముదురుతున్న నేపథ్యంలో వేకువ జామునే వచ్చి పని పూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు. ఇక్కడ టెక్నీషియన్లు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

వెంకటస్వామి వర్ధంతి

బెల్లంపల్లి, మార్చి 27 : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి 23వ వర్ధంతిని బుధవారం బెల్లంపల్లిలో జరుపుకొన్నారు. వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, కార్యదర్శి దేవదాస్, మండలాల బాధ్యులు చక్రవర్తి, రమేశ్, సుధాకర్, చంద్రశేఖర్, రాజేశ్, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల ఇష్టారాజ్యం

- డ్రైవర్ల నిర్లక్ష్యంతో ప్రయాణికుల అవస్థలు

ఇసుక లోడ్‌పై పరదా లేకుండా వెళ్తున్న ట్రాక్టర్లు

గోదావరి నుంచి ఇసుక తరలించే ట్రాక్టర్ డ్రైవర్ల ఇష్టారాజ్యంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. హాజీపూర్ మండలం వేంపల్లిలో గోదావరి ఇసుక రీచ్ నుంచి లోడ్ తీసుకువెళ్లే డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా ఏ ఇసుక ట్రాక్టర్ లోడ్‌తో వెళ్తున్నా అందులోని ఇసుక వెనకాల వచ్చే వాహనదారులపై పడకుండా పరదా కప్పుకొని వెళ్లాలి. కానీ కొందరు డ్రైవర్లు ఇసుకపై పరదా కప్పకపోవడంతో పాటు స్పీడ్‌గా లోడ్‌తో వెళ్తుండడంతో వెనకాల వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక కండ్లలో పడి ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్

అనుకూల రకాలను ఎంచుకోవాలి

జగిత్యాల టౌన్, మార్చి 27 : ఉత్తర తెలంగాణ మండల రైతులు పంటలను సాగు చేసే ముందు వాతావరణ అనుకూల రకాలను ఎంచుకోవాలని డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్ డాక్టర్ పీ రఘురాంరెడ్డి తెలిపారు. పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో బుధవారం విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకుడు డాక్టర్ సుధారాణితో పాటు అనుబంధ శాఖల అధికారులతో ఉత్తర తెలంగాణ మండల పరిశోధనా విస్తరణ సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. సరైన శాస్త్రీయ, సాంకేతిక యాజమాన్య పద్ధతులను రైతులు పాటించడం వల్ల అనుకున్న దాని కంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు ఒక్క వరి పంటపైనే ఆధారపకుండా ఇతర రకాలను కూడా ఎంచుకోవాలని సూచించారు. మార్కెట్‌లో ఎక్కువ అవసరం ఉన్న పంటలపై దృష్టి పెట్టడం వల్ల రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. అలాగే పరిశోధనా స్థానం ద్వారా రైతులు సూచనలు, సలహాలు తీసుకోవడం వల్ల పంట నష్టం జరుగకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. అవసరానికి అనుకూలంగా మాత్రమే ఎరువులు, పురుగు మందులను వాడాలని సూచించారు. పురుగు మందులను ఎక్కువ మోతాదులో వాడకుండా పురుగులను గుర్తించి, వాటి నివారణకు సరియైన మందులను మాత్రమే వాడాలని వివరించారు. అనంతరం పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతేడాది జరిగిన పరిశోధనా ఫలితాలను రైతులకు వివరించారు. వరి, చెరుకు, పత్తి, సోయ, శనగ వంటి పంటలపై పరిగిన పరిశోధనలను రైతులకు వివరించారు. గతేడాది వాతావరణ మార్పులు, వర్షాపాతం, ఏ జిల్లాలో ఏ మోతాదులో ఉన్నదో సూచిస్తూ చీడపీడల వ్యాప్తితో ఎంత మోతాదులో పంట నష్టం జరిగిందో తెలిపారు. అనంతరం రైతుల ప్రశ్నలకు వివిధ పంటల్లో ఏర్పడ్డ మార్పులపై ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీ మంజులత వివరించారు. ఆదిలాబాద్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డ